సుబ్బారావుకి పెళ్లయి సరిగ్గా ఏడు సంవత్సరాలు. భార్య శ్రీదేవి మంచి అందగత్తె, విద్యావంతురాలు, అణుకువ కలది. అంతకంటే ముఖ్యంగా సుబ్బారావంటే గౌరవ మర్యాదలుగలది. అతనంటే పడి చస్తుంది.

కాకపోతే కాస్త పిచ్చుంది. పిచ్చంటే మామూలు పిచ్చే... అదేనండీ టీవీ సీరియల్స్ చూడడం. పెళ్లయిన కొత్తల్లో సుబ్బారావు... పోనీలే పాపం అనుకుని పెద్దగా పట్టించుకోలేదు. తర్వాత తర్వాత తెలిసింది ఆ పైత్యం ఎక్కువే ఉందని.

పాపం సుబ్బారావుకి అప్పుడప్పుడూ ఆ టీవీ సీరియల్స్ పుణ్యమా అని దాంపత్య జీవితంలో కూడా మైనస్ డేలుండేవి.

ఈ విషయంలో ఏడేళ్ల తరువాత తేనెటీగ కుట్టి చాలా అప్‌సెట్ అయి వేరే అమ్మాయిల విషయంలో ఆలోచనలో పడ్డాడు. దీనికీ కారణముంది.

అప్పారావు అనే ఓ కొలీగ్ ఈ మధ్యనే ఒక సెకండ్ సెటప్‌ని సెట్ చేసుకున్నాడట.

అప్పారావుదీ సుబ్బారావు కేసు టైపు కాకపోయినా కాస్త అటూ ఇటుగా అటువంటిదే.

# సెల్ టూ సెల్ ఫ్రీ

-శ్రీలతార్జున్




ఇటువంటి ఆలోచనలతో సతమతమవుతూ ఆ రాత్రి శ్రీదేవికోసం ఎదురు చూళ్ళేక దిక్కుమాలిన టీవీ సీరియల్స్ నా సంసారంలో నిప్పులు పోస్తున్నాయి అని గొణుక్కుంటూ ఆరుబయట మంచం వేసుకుని నిద్రపోయాడు సుబ్బారావు.

***

ఆ రోజు సుబ్బారావు పని చేస్తున్న ఆఫీసులో కొత్తగా ఓ అమ్మాయి జాయిన్ అయింది. పేరు సురేఖ. చాలా మోడరన్‌గా ఉంది. ఖరీదైన డియోడరెంట్ వాడుతుందని సురేఖ ఆఫీసులోకి రాగానే అర్థమైపోయింది సుబ్బారావుకి.

ఆ అమ్మాయితో సుబ్బారావు పరిచయం ప్రపంచంలోనే అతి పెద్ద మర్రి చెట్టెంత పెద్దగా పెరిగిపోయింది.

ఇద్దరూ కలసి కాఫీలకు, టీలకు వెళ్ళుండేవారు. సురేఖ-సుబ్బారావులు



## కూతురు పుట్టింది

గత ఏడాది పెళ్లి చేసుకున్న సూర్య-జ్యోతికలు ఇప్పుడు తల్లిదండ్రులు కూడా ఐపోయారు. ఈమధ్యనే జ్యోతిక ఓ పాపకి జన్మనిచ్చింది. శుక్రవారం నాడు పుట్టింది కాబట్టి మహాలక్ష్మి తమ ఇంట అడుగుపెట్టిందని ఎంతో మురిసిపోతున్నారు సూర్య-జ్యోతికలు. పెళ్లి తర్వాత జ్యోతిక సినిమాలకు గుడ్‌బై చెప్పేసింది. ఇక సూర్యకి పెళ్లి తర్వాత చెప్పుకోదగిన హిట్టు లేదు. ఇప్పుడు కూతురు పుట్టింది కాబట్టి తండ్రి కెరీర్ మలుపు తిరుగుతుందేమో చూడాలి! ఆల్ ది బెస్ట్ సూర్యా!




రెస్టారెంట్‌కి వెళితే ఒకసారి బిల్లు సుబ్బారావు పే చేస్తే రెండవసారి సురేఖ ఇచ్చేస్తుంది.

అంటే ఆమె డబ్బు మనిషికాదు. ఇది సుబ్బారావుకి పిచ్చపిచ్చగా నచ్చేసింది.

జేబుకి చిల్లుపడే అవకాశంలేదు.

సురేఖతో రోజుకోస్సారైనా మాట్లాడందే సుబ్బారావుకి ఆఫీసులో పని చేయబుద్ధి కావడంలేదు.

అలా అలా పరిచయం కాస్తా ప్రణయం దాకా వచ్చింది. సుబ్బారావు తనకు పెళ్లయిన విషయాన్ని దాచుకోకుండా సురేఖకు చెప్పేసాడు.

దానికి సురేఖ ఫర్వాలేదంది.

సుబ్బారావు బంగీ జెంప్ చేసినంత సంబరపడ్డాడు. మాటలు బాగా పెరిగాయి.

ఎంత ఆఫీసులో మాట్లాడుకుంటున్నా ఇద్దరికీ తనివి తీరడంలేదు. అందుకే ఇంటికెళ్లిన తరువాత కూడా మాట్లాడుకోవడానికికని చెరో సెల్లు కొనుక్కున్నారు.

అవి ఆఫర్ సెల్లులు.

అంటే సెల్ టూ సెల్ ఫ్రీ అన్నమాట.

ఐతే తన సెల్లులో సురేఖ అని పేరు ఫీడ్ చేసుకుంటే భార్యకు ఎక్కడ అనుమానం వస్తుందోనని భయపడి సురేష్ అని ఫీడ్ చేసుకున్నాడు.

అలా అలా ఇద్దరూ సెల్ టూ సెల్... తెగ మాట్లాడేసుకుంటున్నారు.

***

ఓ రోజు సాయంత్రం బాత్రూంలో సుబ్బారావు స్నానం చేస్తుండగా సురేఖ నుండి ఫోన్ వచ్చింది.

“ఏమండీ! ఎవరో సురేష్‌ట. ఫోన్ చేసారు. తరువాత కాల్ చేయమని చెప్పమంటారా?” అంటూ సెల్‌తోపాటు బాత్రూం తలుపు దగ్గరకొచ్చి కేకేసింది శ్రీదేవి.

సుబ్బారావుకి గుండె ఆగినంత పనయింది.

“అమ్మో...వద్దే నేనే మాట్లాడాలి” అంటూ మొహానికి, ఒంటికీ నురగతోనే చెంగున బైటకి గెంతి సెల్ అందుకుని దూరంగావున్న పెరట్లోకి వెళ్లి గుసగుసగా మాట్లాడుతూ భయం భయంగా భార్యవైపు చూస్తూ ఫోన్ కట్ చేసాడు సుబ్బారావు.

“అమ్మో... ఇంకా నయం. శ్రీదేవి ఫోన్ కాల్ రిసీవ్ చేస్కోలా. కొంప మునిగేది విషయం తెలిసుంటే” అనుకుంటూ గజగజ వణుకుతూ సబ్బు నురగతో కళ్లు మండుతున్నా ఓర్చుకుంటూ అలాగే మళ్లీ బాత్రూంలోకి దూరాడు సుబ్బారావు.

***

ఇంకోరోజు స్కూటర్‌మీద శ్రీదేవి, సుబ్బారావులు షాపింగ్‌కు వెళ్తుండగా సెల్లు మోగింది.

అది దురదృష్టంకొద్దీ శ్రీదేవి చేతుల్లోనే వుంది.

“ఏమండీ! సురేష్‌ట. ఫోన్ చేసాడు. తరువాత కాల్ చేయమని చెప్పనా... మీరసలే బండి నడుపుతూ సెల్‌లో మాట్లాడడం తప్పు అంటారుగా?” అంది.

సుబ్బారావుకి చలిజ్వరం వచ్చినంత పనైంది. బండి పడేసినంత పనిచేసి చివరికెలాగో బ్యాలెన్స్ చేసుకుని భార్య చేతిలోని సెల్‌ని గభాల్న లాక్కుని స్కూటర్ స్టాండ్‌ని కూడా వేయకుండానే దాన్నలా అలాగే వదిలేసి దూరంగా వెళ్లి సురేఖతో గుబులుగుబులుగానే ఏం మాట్లాడుతున్నాడో తెలియకుండానే మాట్లాడేసాడు.

ఓపక్కన భయం భార్యకు అనుమానం వస్తుందేమోనని. భయం

భయంగా భార్యవైపు చూసాడు.

శ్రీదేవి స్కూటర్ లేపడానికి ట్రై చేస్తోంది. పరుగెత్తుకుంటూ భార్య దగ్గరకొచ్చాడు.

"సారీ సురేఖా...కాదు కాదు...సురేష్... కాదు కాదు శ్రీదేవి... ఆఫీసు ఫైల్స్ విషయంలో సురేష్‌కి ఏదో డౌట్ వచ్చి ఫోన్ చేసాడులే" అంటూ బండిని లేపి భార్యను ఎక్కించుకుని బ్రతుకుజీవుడా అనుకుంటూ బయలుదేరాడు సుబ్బారావు.

సురేఖ ఏంటో... సురేష్ ఏంటో అంతా అయోమయంగా అన్పించింది శ్రీదేవికి.

అక్కడే అనుమాన బీజం పడింది.

★★★

అలా ఈ సెల్‌వల్ల రకరకాల ఇబ్బందులు పడ్తున్న సుబ్బారావుపై శ్రీదేవికి ఏదో విషయంలో...సురేఖ, సుబ్బారావు మ్యాటర్‌పై బాగా అనుమానమొచ్చింది.

అదేదో తెలుగు సినిమాలోలాగా శ్రీదేవి, సురేఖలు మార్కెట్‌లోనూ, సురేఖ వీధిలోనూ, శ్రీదేవి వాళ్ల వీధిలోనూ, చివరికి సుబ్బారావు ఆఫీసులోనూ తెగ పోట్లాడేసుకున్నారు.

చివరికి సుబ్బారావు తరపు పెద్దలు, శ్రీదేవి తరపు పెద్దలు ఫ్రేంలోకి వచ్చారు. విషయం కనుక్కున్నారు.

సుబ్బారావుని తెలుగులోవున్న బూతులన్నీ వరుసపెట్టి తిట్టాడు వాళ్ల నాన్న రామారావు.

మామగారు, బావమరుదులు, తోడళ్లుళ్లు అందరూ కలసి ఒక్కసారి బ్రైన్ వాష్ చేసారు.

"ఛ...ఛ...అనవసరంగా బంగారంలాంటి భార్యను ఇబ్బంది పెట్టాను. నేనూ ఇబ్బంది పడ్డాను. బంధువులందరిలోనూ చులకన అయ్యాను. సురేఖా వద్దు, ఈ సెల్లూ వద్దు" అంటూ సెల్లుని ఈడ్చి నేలకేసి కొట్టాడు. అంతటితో ఊరుకోకుండా అందరూ చూస్తుండగానే పెరట్లోవున్న నిండా నీళ్లున్న బావిలో దూకేసాడు సుబ్బారావు.

ఎలాగోలా పాపం బైటికి తీసారు, నీళ్లు కక్కించారు. ఐనా స్పృహలోకి రాలేదు సుబ్బారావు.

"తడిసిన సుబ్బారావు మొహంమీద మళ్లీ నీళ్లు జల్లి చూడండి" అన్నారెవరో.

చల్లని నీళ్లు మొహంమీద, అలాగే ఒంటిమీద కూడా పడుతుంటే... మొత్తానికి సుబ్బారావుకి మెలకువ వచ్చేసింది.

"సారీ శ్రీదేవీ... ఇంకెప్పుడూ జీవితంలో ఇలాంటి తప్పు చేయను. నన్ను క్షమించు. అన్నట్లు నన్ను బావిలో నుండి ఎవరు బైటకి తీసారు?" అని పాలిపోయిన ముఖంతో అడిగాడు సుబ్బారావు.

"మీరు తప్పు చేయడమేమిటి? నేను మిమ్మల్ని క్షమించడమేమిటి? మిమ్మల్ని బావిలోనుంచి తీయడమేమిటి? వార్నాయనో... మీకేదో మానసిక రోగం పట్టుకుంది. ఇదంతా నేనిలా టీవీ సీరియల్స్ చూస్తూ మిమ్మల్ని పట్టించుకోకపోవడంవల్లనే జరిగింది. అమ్మో... ఇక మిమ్మల్ని వదిలి ఆ దిక్కుమాలిన సీరియల్స్ చూడనంటే చూడను. మీరు నన్ను క్షమించండి" మొగుడి ముందు వాపోయింది శ్రీదేవి.

"సరేలేవే ఇంతకీ నాకేమయిందీ?" అనడిగాడు సుబ్బారావు.

"నేను మిమ్మల్ని పట్టించుకోవడంలేదని, రోజులాగే రాత్రి కూడా ఆరుబయట మంచం వేసుకుని పడుకున్నారు. వర్షం మొదలైందనీ మిమ్మల్ని లేపాను. మీరేంటో అర్థంపర్థం లేకుండా పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు" అంది శ్రీదేవి.

"అబ్బా... ఇదంతా కలా... బాబోయ్ ఇలాంటి సెకండ్ సెట్టింగ్‌లో ఇంత స్వెట్టింగ్ ఉంటుందా? అలాంటిదేం పెట్టుకోకూడదు బాబూ... నా శ్రీదేవే నా పాలిట సిరిదేవి" అనుకుంటూ భార్య వెనుకాలే మంచం, పక్కబట్టలు తీసుకుని వెచ్చని గదిలోకి వెళ్లాడు సుబ్బారావు.

★★★

ఆ తరువాత శ్రీదేవి సీరియల్స్ చూడడం మానేసింది.


సుబ్బారావు జీవితంలో వసంతం తొంగిచూసింది.

పుట్టిన పాపకు పేరు వసంత అని పెట్టుకున్నారు.

కానీ శ్రీదేవి మాత్రం

"వసంత ఏమిటండీ పాత పేరు? సురేఖ అని పెట్టుకుందాం" అని అనేసరికి గొంతులో పచ్చి వెలక్కాయ పడింది సుబ్బారావుకి.

★



## చెట్టెక్కించే పరికరం

తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇటీవల కొబ్బరి, తాడిచెట్లను ఎక్కటానికి ఒక ఆధునిక పరికరాన్ని రూపొందించింది. మైల్డ్ స్టీలుతో తయారుచేయబడిన ఈ పరికరం పార్టుల్ని కొబ్బరితోట దగ్గర ఎస్సెంబుల్ చేసుకుని చెట్టెక్కి కాయల్ని దింపుకున్న తరువాత 15 నిమిషాల్లో విడదీసి మళ్లీ మూట కట్టుకొని వెళ్లిపోవచ్చునట.ఆడవాళ్లు కూడా అవలీలగా చెట్టునెక్కి ఉపయోగించగల ఈ పరికరం ఖరీదు రూ.2,500!

-తటవర్తి

